

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 25.0



కలిదిండి సుజాత(భీమవరం), జక్కంశెట్టి శ్రీమన్నారాయణ (నరసాపురం), బడేటి వీరబ్రహ్మం(పెనుగొండ)

మూడూ టీడీపీకే..

- ఏఎంసీ చైర్మన్‌ల నియామకం
- భీమవరానికి సుజాత
- నరసాపురానికి శ్రీమన్నారాయణ
- పెనుగొండకు వీరబ్రహ్మం
- పెండింగ్‌లో ఆచంట

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని మూడు మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. భీమవరం, నరసాపురం, పెనుగొండ ఏఎంసీలు మూడింటిని టీడీపీకే కేటాయించారు. జిల్లాలో మొత్తం పది ఏఎంసీలకుగాను ఇప్పటి వరకు తొమ్మిది మంది చైర్మన్‌లను ఎంపిక చేశారు. ఆచంట ఒక్కటే పెండింగ్‌లో వుంది. జనసేనకు చెందిన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ప్రాతినిధ్యం వహిస్తున్న భీమవరంలో ఏఎంసీ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత కలిదిండి రామచంద్రరాజు భార్య సుజాతను నియమించారు. వీరు పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశంలోనే కొనసాగుతున్నారు. జనసేన ఎమ్మెల్యే నాయకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నరసాపురంలో ఏఎంసీ చైర్మన్‌గా జక్కం శ్రీమన్నారాయణ నియమితులయ్యారు. ఆయన టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆచంట టీడీపీ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పరిధిలోని పెనుగొండ ఏఎంసీకి చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత బడేటి వీరబ్రహ్మంను నియమించింది. అయితే తాడేపల్లిగూడెం, ఉండి ఏఎంసీలకు జనసేనకు చెందిన చాపల రమేష్, జుత్తిగ నాగరాజును ప్రకటించినప్పటికి ఇప్పటి వరకు ఉత్తర్వులు వెలువడక పోవడం గమనార్హం. భీమవరం, ఆకివీడు, నర్సాపురం, పాలకొల్లు, పెనుగొండ, అత్తిలి, తణుకు ఏఎంసీ చైర్మన్ పదవులను తెలుగుదేశం పార్టీకి కేటాయించినట్లు అయ్యింది.

ఏలూరు జిల్లాలో ఇలా..

ఏలూరు జిల్లాలోని మంత్రి కొలుసు పార్థసారధి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడులో ఏఎంసీ చైర్మన్ పదవి బీజేపీ మహిళా నేత కుంపటి అరుణకు దక్కింది. జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న పోలవరంలో ఏఎంసీ చైర్మన్ పదవి టీడీపీకి చెందిన పొట్టా రామారావును నియమించారు. బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న కైకలూరులో ఏఎంసీ చైర్మన్ పదవికి తాను సూచించిన పూల రామచంద్రరావును కాకుండా పెనుమత్స త్రినాథ్ రాజును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అందరూ విస్తుపోయేలా ఈ మూడు మార్కెట్ కమిటీల్లోను చైర్మన్ల నియామకం జరగడం రాజకీయ వర్గాలను ఒకింత గందరగోళ పరిచినట్లైంది.



రైల్వేకు 'అమృత్'

తాడేపల్లిగూడెం, భీమవరం టౌన్ స్టేషన్లకు రెండో విడత నిధులు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి):జిల్లాలో తాడేపల్లిగూడెం, భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ల అభివృద్ధికి అమృత్ నిధుల వర్షం కురిపిస్తోంది. ఈ రెండు స్టేషన్లకు మొదటి విడత రూ.23 కోట్లు విడులకాగా ఈ ఏడాది బడ్జెట్‌లో రెండో విడత నిధులు విడుదల చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 130 స్టేషన్ల అభివృద్ధికి రూ.2981 కోట్లు విడుదల చేశారు. జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లకు నిధుల కేటాయింపుతో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు సమకూరనున్నాయి. మొదటి విడత నిధులతో ప్లాట్‌ఫాం షెల్టర్స్ ఏర్పాటు, పార్కింగ్ స్టాండ్, మోడరన్ ఏసీ టాయిలెట్స్, ఎక్సలేటర్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్, ఎలివేషన్, డ్రింకింగ్ వాటర్ సిస్టం పనులు పురోగతిలో ఉన్నాయి. తాజా నిధులతో క్వార్టర్స్ ఏర్పాటు, సర్క్యులేటింగ్ ఏరియా, స్టేషన్ మాస్టర్ గది ఏర్పాటు, వీఐపీ లాంజ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.



ఉప్పుటేరు ప్రక్షాళనకు రూ.500 కోట్లు

ఉప్పుటేరు ప్రక్షాళన, ప్రవాహ వేగాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సముద్రపు నుంచి ఎగదన్నే నీటితో ఉప్పుటేరులోకి ఇసుక మేటలు వేస్తోంది. ఇసుక చేరకుండా అడ్డుగోడ (బ్యాక్ వాటర్ వాల్) నిర్మించే ప్రణాళిక రూపొందించారు. కేవలం నీరు మాత్రమే ఎగదన్ని ఇసుక సముద్ర ముఖ ద్వారం వద్ద ఉండిపోతుంది. దశాబ్దాల నుంచి డ్రెడ్జింగ్ నిర్వహించక ఉప్పుటేరు గర్భం పూడుకుపోయి ప్రవాహ వేగం మందగించింది. ఉప్పుటేరు పరీవాహక భూముల్లో ముంపు సమస్యతో నష్టం వాటిల్లుతోంది. ఉప్పుటేరు ముప్పును తప్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

- సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం
- ప్రభుత్వానికి పంపిన జిల్లా అధికారులు
- డ్రెడ్జింగ్‌కు కసరత్తు
- ముంపు నివారణపై దృష్టి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉప్పుటేరు ముప్పు తప్పించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ప్రవాహ వేగం పెంచడానికి, డ్రెడ్జింగ్‌కు అధికారులు సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేశారు. సముద్ర నీరు ఎగదన్నడంతో ఉప్పుటేరులో ఇసుక మేటలు వేస్తోంది. దీనితో అడ్డుగోడ నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. దశాబ్దాల నుంచి డ్రెడ్జింగ్ లేకపోవడంతో ప్రవాహం మందగించింది. కొల్లేరు నుంచి వరద నీరు బయటకు వెళ్లాలన్నా డ్రెయిన్ల నుంచి నీరు సక్రమంగా ఉప్పుటేరులో చేరాలన్నా సమస్య ఏర్పడుతోంది. వర్షా కాలంలో డ్రెయిన్లు ఎగదన్ని ఉప్పుటేరు పరీవాహక ప్రాంతాలు ముంపుబారిన పడుతున్నారు. ఆక్వా రంగం దారుణంగా దెబ్బతింటోంది. రైతులు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోతున్నారు. ముంపుబారి నుంచి గట్టెక్కేందుకు ఉప్పుటేరులో పూర్తిస్థాయి డ్రెడ్జింగ్ నిర్వహించాలని సంకల్పించింది. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. డ్రెడ్జింగ్ నిర్వహించేందుకు రూ.500 కోట్లతో నివేదిక ప్రభుత్వానికి సమర్పించారు.

దశాబ్దాల కల

ఉప్పుటేరుతోపాటు, బుడమేరును ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రెండింటికీ ఏకకాలంలో నిధులు విడుదల చేసేలా జలవనరుల శాఖ కసరత్తు చేస్తోంది. ఉప్పుటేరులో డ్రెడ్జింగ్ చేపడితే ఆకివీడు, కాళ్ల, భీమవరం రూరల్, మొగల్తూరు మండలాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రవాహ వేగం పెరుగుతుంది. జిల్లాలో నాలుగు మండలాల డ్రెయిన్లకు నీరు ఎగదన్నే ముప్పు తప్పుతుంది. సముద్రం నుంచి ఆటుపోట్లు తగ్గుముఖం పడతాయి. ఉప్పుటేరు-సముద్ర ముఖద్వారం వద్ద కొద్దిపాటి ఎత్తులో అడ్డుగోడను నిర్మించనున్నారు. ఉప్పుటేరు ప్రవాహనానికి అడ్డు ఉండదు. వేసవిలో సముద్రం నుంచి నీరు ఎగదన్నేటప్పుడు ఇసుక రాదు. ఉప్పుటేరులో ఇసుక మేటలు వేయకుండా చిన్నపాటి గోడ (బ్యాక్ వాటర్ వాల్) నిర్మించేలా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ప్రభుత్వానికి ప్రాజెక్ట్ నివేదికను పంపారు.

జిల్లాలో రోడ్ల మరమ్మతులకు

రూ.20.65 కోట్లు

భీమవరం టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి):జిల్లాలో రెండు ప్రధాన రహదారుల మరమ్మతులకు రూ.6.15 కోట్లు, 5 రాష్ట్ర రహదారుల మరమ్మతులకు రూ.14.50 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వాండ్రం-సీసలి రోడ్డు 2 కిలో మీటర్ల పరిధికి రూ 2.65 కోట్లు, ఉరదల్లపాలెం-దువ్వ, దువ్వ - ఆరుళ్ల 8.8 కిలో మీటర్ల పరిధికి రూ.3.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మార్టేరు-ప్రక్కిలంక రోడ్డుకు రూ.3 కోట్లు, నరసాపురం-అశ్వారావుపేట రోడ్డుకు రూ2.50 కోట్లు, పాలకొల్లు - దొడ్డిపట్ల రోడ్డుకు రూ.5 కోట్లు, పెనుమంట్ర- వీరవాసరం రోడ్డుకు రూ.2.50 కోట్లు, పాలకొల్లు-ఆచంట రోడ్డుకు రూ 1.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి రోడ్డు మరమ్మతులను చేపడతామని తెలిపారు.

రోగులకు అందించే సేవల ధరలు ప్రకటించాలి

భీమవరం టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్స్ డయాగ్నోసిస్ సెంటర్స్ ల్యాబ్ నిర్వాహకులు సేవల ధరలు ప్రకటించాలని జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయి తెలిపారు. రిసెప్షన్ కౌంటర్ వద్ద ధరలు ప్రదర్శించాలని ఆదేశించారు. వారం రోజుల లోపు వివరాలను జిల్లా వైద్య శాఖ కార్యాలయానికి అందించాలన్నారు. ఈనెల 27లోపు పంపని వారిపై ఏపీ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడు ? 6 సాంకేతికతతో నేరాల అదుపు



ట్రిపుల్ ఐటీ రెండో విడత కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి):రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రెండో విడత కౌన్సెలింగ్ గురువారం ప్రారంభించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ సండ్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. మొత్తం 803 సీట్లకు 803 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. 573 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకాగా 557 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఏవో లక్ష్మణరావు, అకడమిక్ అసోసియేట్ డీన్‌లు చిరంజీవి, ప్రొఫెసర్ గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



గమళ్లపాలెంలో స్కూల్ బస్సు బోల్తా 7

ప్లాస్టిక్ నిషేధించలేరా..?

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

- పట్టణాల్లో రక్షిత నీరు అందించాలి
- పింక్ టాయిలెట్స్ నిర్మాణంలో జాప్యం
- 'భవ్య భీమవరం' ప్రగతి ఏదీ..?
- వచ్చే నెల 15 నాటికి పనులు పూర్తి కావాలి
- కలెక్టర్ నాగరాణి దిశా నిర్దేశం




అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి):భీమవరం పట్టణంలో ప్లాస్టిక్‌ను అధికారులు నిషేధించలేరా? పట్టణ ప్రజలకు రక్షిత నీరు అందించలేరా? పింక్ టాయిలెట్స్ ఎందుకు నిర్మించలేకపోతున్నారని కలెక్టర్ నాగరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'భవ్య భీమవరం' అభివృద్ధిపై దాతల సహకారంతో చేపట్టిన పనులు నత్తనడకన సాగడంపై కలెక్టర్ మండిపడ్డారు. దాతలు, అధికారులతో గురువారం కలెక్టర్ నాగరాణి సమీక్షించారు. భీమవరం పట్టణంలో ఆరు నెలల క్రితమే ప్లాస్టిక్ నిషేధం ప్రకటించినా ఎందుకు నిరోధించలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు కనిపిస్తే సంబంధిత శానిటరీ సెక్రటరీలపై చర్యలు తప్పవన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రభులే అవకాశం ఉందని, పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు రాకూడదన్నారు.

పింక్ టాయిలెట్స్ నిర్మాణంలో అలసత్వం

మహిళలు, గర్భవతులు, పాలిచ్చే తల్లులు, యువతుల కోసం ప్రతి పట్టణంలో చేపట్టాల్సిన పింక్ టాయిలెట్ నిర్మాణంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని కలెక్టర్ నాగరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ కమిషనర్,

మిగతా 8వ పేజీలో



రప్పా రప్పా అంటే పెట్టుబడులు రావు

'రప్పా రప్పా అంటూ జగన్ రెచ్చగొట్టే నినాదాలు చేస్తే పెట్టుబడులు రావు. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఏపీని టెక్నాలజీ, పెట్టుబడి, పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దబోతున్నాం' అంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ద్వారకాతిరుమలలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు నిర్వహించారు. మెయిన్‌లో..

నేటి నుంచి విభిన్న ప్రతిభావంతుల

గుర్తింపు శిబిరాలు

తాడేపల్లిగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలింకో ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధుల గుర్తింపు శిబిరాలు ఈ నెల 18 నుంచి 25 వరకు నిర్వహించనున్నారు. 18న నరసాపురం, 19న పాలకొల్లు, 21న పెనుగొండ, 22న తణుకు, 23న తాడేపల్లిగూడెం, 24న ఉండి, 25న భీమవరంలో ఎస్‌జేడీఎం హైస్కూల్ వద్ద నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యూడీఐడీ కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నాలుగు ఫొటోలు, మొబైల్ నంబర్, అన్ని పత్రాల రెండు సెట్లు తెచ్చుకోవాలని కోరారు. వృద్ధులు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, 4ఫొటోలు, మొబైల్ నంబర్, ఇవన్నీ రెండు సెట్లు వంతున తీసుకుని రావాలి. ఎంపికైన వారికి అవసరమైన కృత్రిమ ఉపకరణాలు అందజేస్తారు.

జాతీయ రహదారి-165

రైతుల అభ్యంతరాలపై విచారణ

భీమవరం టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-165 నిర్మాణంలో పాలకోడేరు మండలం విస్సాకోడేరు, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం గ్రామ రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై గురువారం జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ నిర్వహించారు. భూసేకరణపై గత నెల 14న అభ్యంతరాలు గడువు ముగియడంతో, పాలకోడేరు మండలం విస్సకోడేరు, పెన్నాడా అగ్రహారం, శృంగవృక్షం గ్రామ రైతులు లేవనెత్తిన ఆరు అభ్యంతరాలపై ఈరోజు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డు అలైన్‌మెంట్, తమ భూమికి లభించే నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలైన్‌మెంట్ మార్పు తమ పరిధిలోనిది కాదని జేసీ తెలిపారు. నష్టపరిహారం విషయంలో సర్వే నంబర్ ప్రకారం సమీప ప్రాంతాలలో గత మూడేళ్లుగా జరిగిన లావాదేవీలను చూసి సరాసరిన ప్రభుత్వ నిబంధన ప్రకారం రైతులకు చెల్లించడం జరుగుతుందని జేసీ వివరించారు. తమ భూములను ప్రభుత్వానికి అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని కాకపోతే తాము నష్టపోకుండా హెచ్చు మొత్తంలో న్యాయమైన పరిహారం ఆశిస్తున్నామి. సాధ్యమైనంత త్వరగా పరిహారం సొమ్ము ఇప్పించాలని జాయింట్ కలెక్టరును రైతులు కోరారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం..

అలైన్‌మెంట్ ఏ సర్వే నెంబర్ నుంచి వెళుతుందని రైతులు అడగడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అందజేస్తామని తెలిపారు. గొరగనమూడి గ్రామం నుంచి రైతులు అభ్యంతరాలు లేవనెత్తలేదు. విచారణలో ఎన్‌హెచ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆర్ అండ్ బి ఎన్ శ్రీనివాసరావు, పాలకోడేరు తహసీల్దార్ ఎన్‌బి. విజయలక్ష్మి, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రవాణా రంగానికి ఊరట

వాహనదారులపై గత వైసీపీ ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్ రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచారు. ఏటా వేల రూపాయలు చెల్లించ లేమని వాహనదారులు వినతి పత్రాలు ఇచ్చారు.. ధర్నాలు చేశారు. ఇవేమీ గత ప్రభుత్వానికి పట్టలేదు. ఎక్కడా లేని విధంగా ఇక్కడ గ్రీన్ ట్యాక్స్‌ను పెంచేశారు. ఒకవైపు ఇంధన ధరలు, మరోవైపు పన్నుబాదుడుతో రవాణా రంగం కుదేలైంది. ఎన్నికల ముందే కూటమి పార్టీలు గ్రీన్ ట్యాక్స్‌పై పన్ను తగ్గిస్తామని భరోసా ఇచ్చింది. మంత్రి మండలి ఆమోదం అనంతరం ఈ నెల 16న గ్రీన్ ట్యాక్స్ సవరణ చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.

- వాహనాలపై గ్రీన్ ట్యాక్స్ తగ్గించిన ప్రభుత్వం
- యజమానుల హర్షం

(భీమవరం/పాలకొల్లు-ఆంధ్రజ్యోతి)

రవాణా వాహనాలపై హరిత పన్ను (గ్రీన్ ట్యాక్స్) తగ్గింపుతో వాహన యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జగన్ ప్రభుత్వం భారీగా పెంచిన గ్రీన్ ట్యాక్స్‌ను కూటమి ప్రభుత్వం తగ్గించడంపై వాహన యజమానులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కమర్షియల్ వెహికల్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు, జీవీడబ్ల్యు(గ్రాస్ వెహికల్ వెయిట్) 300 కిలోలు దాటితే వాహన వయస్సు రిజిస్ట్రేషన్ తేదీ నుంచి ఏడేళ్లలోపు హరిత పన్ను ఉండదు. 7నుంచి 12 ఏళ్ల మధ్య ఉన్న వాహనాలకు రూ.1500 హరిత పన్ను చెల్లించాలి. 12 ఏళ్లు దాటిన వాహనాలకు రూ.3వేలు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. సమీప రాష్ట్రాల్లో హరిత పన్ను అతి తక్కువ కాగా జగన్ సర్కార్ అమితంగా పెంచింది. దీనిపై రవాణా వాహన యజమానులు అప్పట్లో ఆందోళనలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం హరిత పన్నుపై కసరత్తు చేసి సమీప రాష్ట్రాల్లో గ్రీన్ ట్యాక్స్‌ను పరిగణనలోకి తీసుకొని నవ్యాంధ్రలో రవాణా వాహన యజమానులకు ఊరట ఇచ్చారు. కర్ణాటకలో హరిత పన్ను రూ.200 నుంచి రూ. 1200 ఉండగా తమిళనాడులో క్వార్టర్ ట్యాక్స్‌పై 10శాతం అధిక పన్ను వసూలు చేస్తున్నారు. తెలంగాణలో ఇప్పుడు మన రాష్ట్రంలో ప్రకటించిన విధంగా ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమలో సుమారు నాలుగు వేల టిప్పర్ లారీలు ఉండగా నాలుగు వేలు రవాణా లారీలున్నాయి. మినీ వ్యాన్లు, ట్రాక్టర్లు, స్కూల్ బస్సులు, వివిధ రకాల రవాణా వాహనాలు జిల్లాలో సుమారు 20 వేలు ఉన్నాయి.

మైనింగ్ సీనరేజి తగ్గించాలి

హరిత పన్ను తగ్గింపుపై ట్రాన్స్‌పోర్టు వాహన యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ మైనింగ్ సీనరేజ్ సైతం తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. మైనింగ్ సీనరేజ్ వలన పరోక్షంగా వినియోగదారులపై భారం

మిగతా 8వ పేజీలో..



ద్వారకాతిరుమల ఆలయానికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

చినవెంకన్న సేవలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

ద్వారకాతిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి సమాచార ప్రసారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సందర్శించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలసి గురువారం సాయంత్రం ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవాలయం వద్ద అనువంశిక ధర్మకర్త ఎస్‌వీ నివృతరావు, ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం బంగారువాకిలి నుంచి లోపలకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం పొందారు. స్వామి, అమ్మవార్ల చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.

ఆషాఢంలోనూ అదిరిన శ్రీవారి హుండీ ఆదాయం

రూ.2.82 కోట్లు లభ్యం



ద్వారకాతిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆషాఢంలోనూ చిన్న తిరుమలేశునికి హుండీ ఆదాయం అదిరింది. హుండీల లెక్కింపు ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 30 రోజుల కాలానికి జరిగిన ఈ లెక్కింపులో శ్రీవారికి నగదు రూపేణా రూ.2.82 కోట్లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణమండప ఆవరణలో గురువారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. 2,82,31,619 రూపాయల నగదుతో పాటు 202 గ్రాముల బంగారం, 5.546 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (15), 1000(12) 2000(14)తో పాటు విదేశీ కరెన్సీ లభించింది.

మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.88.69 లక్షలు



భీమవరం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ హుండీ ఆదాయం గురువారం లెక్కించగా 88 లక్షల 69 వేల 425 రూపాయలు వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్ తెలిపారు. నగదుతో పాటు 92.500 గ్రాముల బంగారం, 623 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ భక్తులు సమర్పించుకున్నారన్నారు. దేవదాయ ధర్మదాయశాఖ అధికారి హరి సూర్యప్రకాశ్ పర్యవేక్షించారని తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయ ఈవో దండు కృష్ణంరాజు, బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు..

కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి వర్మ



అక్కడి అర్చకులతో మంత్రి వర్మ

భీమవరం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ గురువారం వారణాశిలో పర్యటించారు. వారణాశికి క్షేత్రపాలకుడిగా ప్రసిద్ధ చెందిన కాలభైరవ స్వామి ఆల యాన్ని సందర్శించి పత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చేరుకొని విశ్వనాథుడిని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు ఆయన నిర్వహించారు వర్మ మాట్లాడుతూ కాశీ విశ్వనాథుడి దర్శనం ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కలిదిండి వినోద్ వర్మ, వేగేశ్న రంగరాజు, వేగేశ్న పవన్ వర్మ, వేలూరి రామయ్య శర్మ ఉన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడు ?

ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు వెల్లడించి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మొదలు కాకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. ప్రవేశాలు ఎప్పుడు కల్పిస్తారంటూ ఇటు విద్యార్థులు, అటు ప్రైవేటు కాలేజీల యాజ మాన్యాలు ఎదురుచూస్తున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికా రులకు ఏపీ ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజ మాన్యాల అసోసియేషన్ విన్న వించింది. అడ్మిషన్లతో పాటు పెండింగ్‌లో వున్న సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 21న డిగ్రీ కళాశాలలు బంద్ చేస్తామని పిలుపునిచ్చాయి.

- తణుకు, (ఆంధ్రజ్యోతి)

ఇంటర్ ఫలితాలు వచ్చి మూడు నెలలు

ఇప్పటికీ నోటిఫికేషన్ విడుదల చేయని విద్యాశాఖ

ఇతర డిగ్రీలవైపు విద్యార్థులు.. ఆందోళనలో యాజమాన్యాలు

రీయింబర్స్‌మెంట్ సహా పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

లేకుంటే ఈ నెల 21న డిగ్రీ కళాశాలల బంద్‌కు పిలుపు



గందరగోళానికి ప్రధాన కారణం

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం కొనసాగించాలా ? డబుల్ మేజర్ విధానం ప్రవేశపెట్టాలా ?అనే గందరగోళం నెలకొనడమే అడ్మిషన్ల జాప్యానికి ఓ కారణం. ఇప్పటి వరకు సింగిల్ మేజర్ విధానం నడుస్తోంది. ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ విధానం ప్రవేశపెడతామని ప్రతి కళాశాల ఇందుకు అప్‌గ్రేడ్ చేయించుకోవాలని సూచించారు. ఆ మేరకు యాజమాన్యాలు నగదు చెల్లించి అనుమతి తీసుకున్నారు. విద్యార్థులకు డబుల్ మేజర్‌పై అవగాహన కల్పించారు. చాలా మంది తల్లిదండ్రులు దీనివైపు మొగ్గు చూపించారు. కాని, ప్రభుత్వం చివరకు సింగిల్ మేజర్ వైపు మొగ్గు చూపుతూ నిర్ణయం తీసుకుంది.మరోవైపు ఇంతకుముందు ఆఫ్‌లైనన్‌లోనే డిగ్రీ ప్రవేశాలకు అడ్మిషన్లు జరిగేవి.. వైసీపీ వచ్చాక ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టింది..ఈ ఏడాది నుంచి ఆఫ్‌లైన్‌లో ప్రవేశాలు కల్పించే అవకాశం ఉందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీనిపై కూడా అయోమయం నెలకొంది..

లక్షల మంది విద్యార్థులపై ప్రభావం

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 256 ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో అడ్మిషన్ల కోసం లక్షల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. అడ్మిషన్లు తీసుకోవాలంటే కళాశాలలు గుర్తింపు కోసం దరఖాస్తులు చేసుకోవాలి. అడ్మిషన్ల ప్రక్రియ గందరగోళంలో ఉండడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఎవరూ దరఖాస్తు చేయలేదు. దరఖాస్తు చేయాలి, ప్రభుత్వం నుంచి కమిటీ వచ్చి కాలేజీలో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా పరిశీలించి గుర్తింపును పునరుద్ధరిస్తారు. ఇప్పటి వరకు ఇలాంటి ప్రక్రియ మొదలు కాలేదు.

అడ్మిషన్లపై ప్రభావం

ప్రభుత్వ నిర్ణయం ఆలస్యం కారణంగా ఇప్పటికే డిగ్రీలో చేరాలనుకునే వేలాది విద్యార్థులు ఇంజనీరింగ్ ఇతర కోర్సుల వైపు మళ్లిపోతున్నారని యాజమాన్యాలు చెబుతున్నాయి. గత ఏడాది అడ్మిషన్లు 2.50 లక్షల నుంచి లక్షకు పడిపోయాయి. ఇప్పటి పరిస్థితుల నేపథ్యంలో ఇది మరింత తగ్గిపోయే ప్రమాదం ఉంది.

విడుదల కాని బకాయిలు

ప్రభుత్వం కళాశాలలకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికి విడుదల చేయడం లేదు. దీంతో కాలేజీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. బకాయిలను విడతల వారీగా విడుదల చేస్తామని చెప్పినప్పటికి ఇప్పటి వరకు విడుదల చేయలేదు. 2023-24కు మూడు క్వార్టర్లు, 2024-25కు మూడు క్వార్టర్‌లకు బకాయిలు విడుదల చేయాలి. దీనిపైన ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు.

సింగిల్, డబుల్ మేజర్ విధానం అంటే..

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం అంటే విద్యార్థి ఒకే ఒక్క ప్రధాన సబ్జెక్టును మేజర్‌గా తీసుకుని, మిగిలిన సబ్జెక్టులను మైనర్‌గా గాని, సపోర్టివ్‌గా గాని చదవాలి. ఉదాహరణకు బీఎస్సీ (ఫిజిక్స్) అంటే.. ఫిజిక్స్ ప్రధాన మేజర్ సబ్జెక్టు. మిగిలిన సబ్జెక్టులు కెమిస్ట్రీ, మేథ్స్ వంటివి సపోర్టివ్‌గా వుంటాయి.

డబుల్ మేజర్ అంటే డిగ్రీలో రెండు ప్రధాన సబ్జెక్టులను మేజర్‌గా తీసుకుని చదవాలి. ఉదాహరణకు బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్) ఇక్కడ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ రెండూ మేజర్ సబ్జెక్టులు. రెండింటిని సమాన ప్రాముఖ్యతతో చదివి, రెండింటిపైనా లోతుగా అవగాహన పెంచుకుంటారు.

సమ్మె తప్పదా ?

విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. 'డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలి. డబుల్ మేజర్ విధానం అమలు చేయాలి. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి. కొత్త కోర్సులకు అనుమతితో పాటు పాత కోర్సుల మార్పునకు అనుమతి ఇవ్వాలి. ఐదేళ్లపాటు అనుబంధ అనుమతులు మంజూరు చేయాలి. ప్రవేశాల్లో 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. వీటిని పరిష్కరించని పక్షంలో ఈ నెల 21 'కాలేజీల బంద్' చేస్తామని స్పష్టం చేశారు.

• సమస్యలు పరిష్కరించాలి



డిగ్రీ అడ్మిషన్లలో వున్న గందరగోళానికి ప్రభుత్వం తెరదించాలి. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. అడ్మిషన్ల కోసం షెడ్యూల్ విడుదల చేయాలి. అధికారులు చర్యలు వేగవంతం చేయాలి. లేని పక్షంలో ముందుగా నిర్ణయించిన మేరకు నిరసన బంద్ చేయడానికి అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది.

మహమ్మద్ అబీబ్, ఏపీ ప్రైవేటు డిగ్రీ, కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తూర్పు, పశ్చిమ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు

• కళాశాలలపై ప్రభావం



ప్రస్తుతం అడ్మిషన్లలు గందరగోళంలో డిగ్రీ కాలేజీపై ప్రభావం చూపుతున్నాయి. కాలేజీలు మనుగడ ప్రశ్నార్థంగా మారే అవకాశాలు వున్నాయి. డబుల్ మేజర్‌ను అమలు చేయాలి. ఇప్పటికే మిగిలిన చోట్ల ప్రవేశాలు పూర్తయి విద్యా ప్రణాళిక ప్రారంభమైంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

గోపిశెట్టి రామకృష్ణ, ప్రగతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, తణుకు

మొగల్తూరు స్కూల్‌లో వేగంగా నిర్మాణ పనులు

ఉప ముఖ్యమంత్రి పవన్ చొరవతో నిధులు మంజూరు చేసిన లోకేశ్



మొగల్తూరు హైస్కూల్‌లో అదనపు తరగతి గదులకు జరుగుతున్న నిర్మాణ పనులు

మొగల్తూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పంచాయతీ అభివృద్ధిపై దృష్టిపెట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆ దిశగా గ్రామాభివృద్ధి పనులకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. గ్రామంలో తన పేషీ నుంచి పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజను ఈ ఏడాది మార్చి 28న నేరుగా మొగల్తూరు పంపి రచ్చబండ నిర్వహించి గ్రామ సమస్యలు తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి తొలి ప్రాధాన్యతగా ఆయన కుటుంబ సభ్యులు చదివిన మొగల్తూరులోని పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి స్కూల్ అభివృద్ధికి చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించడంతో లోకేష్ మొగల్తూరు ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.1 కోటి 71 లక్షలు నిధులు మంజూరుకు ఈ ఏడాది మార్చి 29న ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలకనుగుణంగా పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ.31.06 లక్షలు, భోజన శాలకు రూ.26 లక్షలు, ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేయడానికి రూ.30 లక్షలు, క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ.59.5 లక్షలు పాఠశాల ప్రహరీగోడ అభివృద్ధికి రూ.10 లక్షలు, సైకిల్ స్టాండ్ నిర్మాణానికి రూ.10 లక్షలు, అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీనిలో భాగంగా తొలివిడతగా పాఠశాల విద్యార్థులకు అవసరమయ్యే నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు కావడంతో గదుల నిర్మాణం పనులు చేపట్టారు. అలాగే మరో 18 లక్షల నిధుల మంజూరుకు తగు ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపారు. పాఠశాలలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతుండటంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు అభినందిస్తున్నారు. వచ్చే వర్షాలు నాటికి పాఠశాల గ్రౌండ్ లెవెల్ అభివృద్ధి పనులు కూడా వేగవంతంగా చేపడితే వర్షాకాలంలో పాఠశాల క్యాంపస్ ముంపు ప్రభావం ఉండదని అభిప్రాయ పడుతున్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్.. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

సాంకేతిక సాయంతో నేరాల అదుపు

పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా

గంజాయి అక్రమ రవాణా అరికట్టడానికి ప్రత్యేక చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

భీమవరం క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నమోదైన దొంగతనాలు, దోపిడీకి, ఆస్తి నేరాలు, హత్యాయత్నం, చీటింగ్ వంటి కేసులపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. భీమవరం విష్ణు కళాశాల సమావేశ మందిరంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, వైద్య, విద్య, న్యాయ, ఇతర శాఖల ఉన్నతాధికారుల సమక్షంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఐజీ అశోక్ కుమార్ హాజరయ్యారు. ఐజీ మాట్లాడుతూ 2025వ సంవత్సరానికి సంబంధించి జనవరి నుంచి జూన్ వరకు జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు.రోడ్డు ప్రమాదాలు, డ్రంకెన్ డ్రైవ్, మోటార్ వెహికల్ యాక్ట్, జూదాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. కేసులు దర్యాప్తు సమయంలో వైద్య శాఖ జారీ చేయు వివిధ ధృవపత్రాలకు సంబంధించిన అంశాలు, సముద్ర తీరం, నదీపరివాహక ప్రాంతాల్లో సంభవిస్తున్న మరణాలు, నివారణా చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటుకు పోలీసు శాఖ కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలను జిల్లా పోలీసు శాఖకు అందించడం జరుగుతుందని ఆయా శాఖల ఉన్నతాధికారులు తెలియజేశారు. అఫెండర్ సర్వే లైట్స్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించుకుని జిల్లాలోని పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆధ్వర్యంలో పోలీసు శాఖ సమర్థవంతమైన సేవలను అందిస్తుందని అన్నారు. క్రైమ్ డిటెక్షన్‌లో రాష్ట్ర స్థాయిలో పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు శాఖ ప్రథమ బహుమతిని అందుకోవడం గర్వకారణమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌తో జిల్లాలో నేరాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు రెవెన్యూ, ఎక్సయిజ్, రవాణా, విద్య, వైద్య, న్యాయ ఇతర శాఖల జిల్లా ఉన్నతాధికారులను సమన్వయపరచుకుంటూ పని చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ నాగరాణిని, ఐజీ అశోక్ కుమార్‌ను సత్కరించారు. అదనపు ఎస్పీ భీమారావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమరేశ్వరన్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి, డిస్ట్రిక్ట్ రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు, ఎఫ్ఎస్ఎల్ అడిషనల్ డైరెక్టర్ ఫణిభూషణ్, డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై మరింత అవగాహన పెంచుకోవాలి

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్యానల్ న్యాయవాదులు చట్టాలపై మరింత అవగాహన పెంచుకుని కక్షిదారులకు నాణ్యమైన న్యాయ సహాయం అందించాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్యానల్ న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా వాదించే కేసులలోని న్యాయవాదులకు వారి విధులు మరింత నైపుణ్యం పెంచుకొనేందుకు ఈ అవగాహన సదస్సు నిర్వహించామని తెలిపారు. మారుతున్న చట్టాలు ఎప్పటికప్పుడు వివిధ కోర్టులు ఇచ్చే తీర్పులపైన వాటి ద్వారా అనుసరించాల్సిన విధి విధానాలుపైన న్యాయవాదులకు అవగాహన కలిగించామన్నారు. ఉచితంగా వాదించే కేసులను త్వరితగతిన పూర్తి చెయ్యాలని, ఎటు వంటి అలసత్వాన్ని వహించకుండా కక్షిదారులకు న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉద్దేశ్యమని ప్యానల్ న్యాయవాదులు చట్టాలపైన అవగాహన పొంది కక్షిదారులకు నాణ్యమైన న్యాయ సహాయం అందించాలని సూచించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పివిఎస్ మునీశ్వరరావు, ప్యానల్ లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్క జ్ఞాపకార్థం బిర్యాని పంపిణీ



తన ఇంటిలో 13 ఏళ్ల పాటు పిల్లలతో కలిసి పెరిగిన సీజర్ (పెంపుడు కుక్క) మరణించి ఎనిమిదేళ్లు అయినా దానిపై అభిమానం పోలేదు. అది మరణించిన జూలై 17వ తేదీన పాలకొల్లు పట్టణంలోని 50 కుక్కలకు యజమాని బిర్యాని పంపిణీ చేశారు. పేదవారికి బిర్యాని అందించి సీజర్‌ను గుర్తు చేసుకున్నారు.

- పాలకొల్లు అర్బన్ (ఆంధ్రజ్యోతి)

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని..

పెదవాగు ఊళ్లపై విరుచుకుపడింది.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఊరంతా కట్టుబట్టలతో బయటపడ్డారు.. ఇళ్లన్నీ మునిగి పోయాయి. సామాగ్రి వరదనీటిలో కొట్టుకుపోయాయి.. పంట చేలన్నీ ధ్వంసమయ్యాయి.. సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజున జరిగిన ఈ భయానక ఘటనను వేలేరుపాడు మండలంలోని 10 గ్రామాల ప్రజలు నేటికి మరచిపోలేకపోతున్నారు.. ఆ రోజు జరిగిన విధ్వంసాన్ని తలుచుకుని ఉలిక్కిపడుతున్నారు.

విరుచుకుపడిన పెదవాగు

ఊళ్ల మీదకు వరదనీరు

కట్టుబట్టలతో ఇళ్లు వదలి పరుగులు తీసిన గిరిజనులు

పెదవాగు విధ్వంసానికి ఏడాది



వరద ఉధృతికి కూలిన ఇళ్లు (ఫైల్ ఫొటో)

వేలేరుపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): 2024 జూలై 18న కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లి వరద నీరంతా తెలంగాణలోని అశ్వారావుపేట పెద వాగు ప్రాజెక్టుకు చేరుకుంది. ఆ రోజు 29 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవడంతో వరదనీరు ఏరులై పారింది. ఆరుమీటర్ల నిల్వ సామర్థ్యం కలిగిన పెదవాగు ప్రాజెక్టుకు భారీస్థాయిలో వరద చేరుకోవడంతో ప్రాజెక్టుపై ఉన్న మూడు గేట్లను పూర్తిగా ఎత్తివేసి నీటిని దిగువకు వదిలారు. దీంతో వరద ఒక్కసారిగా పెదవాగు కట్టలను తెంచుకుని గ్రామాలపై విరుచుకుపడింది. అనుకోని విధంగా వరద వచ్చిపడటంతో ప్రాజెక్టు దిగువన ఉన్న కమ్మరిగూడెం, మేడేపల్లి, వంటిబండ, అల్లూరినగర్, మాదారం, రామవరం, ఊటగుంపు, రాళ్లపూడి, గొల్లగూడెం, వసంతవాడ, పూచిరాల, గ్రామాలకు చెందిన ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు పెట్టారు. రాజమండ్రి నుంచి రుద్రమ్మకోట గ్రామానికి కారులో వస్తున్న ఐదుగురు వ్యక్తులు కారుతో సహా మాదారం సమీపంలోని కొడిసల కాల్వ దగ్గర వచ్చేసరికి ఒక్కసారిగా వచ్చిపడిన వరదతో కారుతో పాటు అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు కొట్టుకు పోయారు. ఈ కారులో డ్రైవర్, మరో ఇద్దరు మహిళలు, మరో ఇద్దరు చిన్నారులు ఉండగా కారు రహదారిపై నుంచి సమీపంలోని పెదవాగు సమీపం వరకు కొట్టుకుపోయి అక్కడ ఒక వెదురు పొదలు అడ్డుపడటంతో అక్కడ చిక్కుకుపోయారు. మాదారం గ్రామప్రజలు ప్రాజెక్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వీరిని రక్షించడానికి ప్రాజెక్టులో ఒక గేటును కిందకు దించారు. వరద కొంత తగ్గుముఖం పట్టడంతో మాదారం, అల్లూరినగర్ గ్రామప్రజలు, యువకులు కారులో చిక్కుకున్న వారిని అతికష్టంతో ప్రాణాలతో కాపాడారు. తిరిగి ప్రాజెక్టు గేటును తెరిచే ప్రయత్నం చేయగా అది మొరాయించింది. దీంతో అంతకంతకు ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగిపోవడంతో కట్టమీద నుంచి వరద పొంగిపోర్లింది. దీంతో ఒత్తిడి అధికమవడంతో ప్రాజెక్టు గేటు ఎడమవైపున భారీ గండిపడటంతో వరద ఉగ్రరూపంతో మరోసారి గ్రామాలపై విరుచుకు పడింది. దీంతో గ్రామంలోని ఇళ్లు అనేక నేలమట్టం అయ్యాయి. మిగిలిన ఇళ్లలోని సామాగ్రి వరదనీటిలో తడిచి పోయి భారీ నష్టం సంబవించింది. మేడేపల్లి నుంచి రాళ్లపూడి వరకు ఆర్అండ్‌బీ రహదారి మొత్తం కొట్టుకుపోగా రోడ్లపై పెద్దపెద్ద గండ్లుపడ్డాయి.



భారీ వరదకు తెగిపోయిన పెదవాగు ప్రాజెక్టు కట్ట (ఫైల్)

ఎడారుల్లా పంట చేలు..

పెదవాగు ఉధృతికి వందలాది ఎకరాల్లో భారీ ఎత్తున ఇసుక మేటలు పేరుకుపోయాయి. కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి జీవించే పెదవాగు పరివాహక ప్రాంత ప్రజలు భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోవడంతో భారీ ఎత్తున నష్టపోయారు. సర్వస్వం కోల్పోయిన తమకు ప్రభుత్వం కేవలం రూ.2 వేలు ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులు ఇచ్చి చేతులు దులుపుకుందని ఇసుక మేటలను ప్రభుత్వమే తొలగిస్తుందని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినా ఇంత వరకు పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. వరదకు కూలిపోయిని ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ఇంత వరకు అమలు చేయకపోవడంతో పూరిగుడిసెల్లోనే ఉంటున్నామని అల్లూరి నగర్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పెదవాగు ప్రాజెక్టు తెగిపోయి తమ బతుకులు బుగ్గిపాలయ్యాయని ప్రభుత్వం కూడా పట్టించుకోక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• ప్రభుత్వం నుంచి సాయం లేదు



పెదవాగు వరదకు ఇళ్లు పూర్తిగా నేలమట్టమై ఇంట్లో సామాను మొత్తం వరదకు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం పక్కా ఇళ్లు కట్టిస్తామని నేటి వరకు కట్టించలేదు. దాతలు ఇచ్చిన బరకాలతో పూరి గుడిసెవేసుకుని అందులోనే నివాసం ఉంటున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు.

-కూసం తమ్మయ్య, అల్లూరి నగర్

• పొలాల్లో ఇసుక మేటలు



పెదవాగు వరదల కారణంగా నాకున్న నాలుగు ఎకరాల మాగాని పొలంలో ఇసుకమేటలు వేశాయి. వరదలకు ఇళ్లు కొట్టుకు పోయి పూర్తిగా నష్టపోయిన మేము పొలాల్లో పేరుకు పోయిన ఇసుకను తొలగించుకోవాలంటే అధిక మొత్తంలో ఖర్చవుతుంది. అంత ఖర్చును భరించే స్తోమత మాకులేదు. ప్రభుత్వం ఇసుక మేటలు తొలగిస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఆ పని చేయలేదు. దీంతో వ్యవసాయం చేసుకునే వీలులేక కూలి పనులకు వెళ్తూ జీవిస్తున్నాం.

- కుంజా మారయ్య, అల్లూరి నగర్

నేడు ఏలూరు కలెక్టరేట్ వద్ద సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసన

ఏలూరు అర్బన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ విధానం కోసం ఈనెల 18న కలెక్టరేట్ వద్ద డీఎస్సీ- 2003 టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి మద్దతు ప్రకటిస్తున్నట్టు ఏపీటీఎఫ్-1938, నోబుల్ టీచర్స్ అసోసియేషన్, యూటీఎఫ్ జిల్లా నాయకులు జి.కృష్ణ, రామ్మోహనరావు, మోహన్‌రావు, సీహెచ్ రమణారావు, మురళి, ముస్తఫాఅలీ, రవికుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కేంద్రప్రభుత్వ మెమో 57 ఉత్తర్వుల ఆధారంగా డీఎస్సీ-2003 టీచర్లకు, 2004వ సంవత్సరం సెప్టెంబరు 1వతేదీ కంటే ముందు నోటిఫికేషన్ విడుదలై సీపీఎస్ పరిధిలో వున్న గ్రూప్-2 ఉద్యోగులు, కానిస్టేబుళ్లకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాల్సి ఉంటుందన్నారు. నిరసన కార్యక్రమానికి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి హాజరవుతారని వివరించారు. ఉమ్మడి జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

స్పిల్‌వే నుంచి 1,15,362 క్యూసెక్కులు విడుదల



పోలవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పోలవరంలో గోదావరి నీటిమట్టం గురువారం నాటికి పూర్తిగా తగ్గింది. దీంతో కడమ్మ స్లూయిజ్ గేట్లు వరద నీటి నుంచి బయటపడ్డాయి. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే నుంచి 1,15,362 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్వే ఎగువన 27.250 మీటర్లు, దిగువన 17.340 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కులు

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఈఈ ఏసుబాబు తెలిపారు.గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉండడం వలన కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాలకు ఖరీఫ్ సీజను అవసరాల రీత్యా 22 పంపుల ద్వారా నీరు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



మార్టేరు ఉన్నత పాఠశాలలో పరిశీలన చేస్తున్న బృందం

గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన

పోడూరు/ పెనుమంట్ర, జూలై 17(ఆంధ్రజ్యోతి) స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కేంద్ర బృందం సభ్యులు గురువారం మండలంలోని కవిటం, పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామాల్లో పర్యటించారు. కవిటంలో అన్ని వీధుల్లోనూ పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పనులను, పాఠశాలల టాయిలెట్స్ నిర్వహణను, వైద్య ఆరోగ్య ఉప కేంద్రం పనితీరును పరిశీలించారు. అంగనవాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రతను పరిశీలించారు.ప్రజలకు సరఫరా చేస్తున్న రక్షిత మంచినీటి సరఫరాను, క్లోరినేషన్ చర్యలు, డ్రైనేజీలను పరిశీలించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ప్రజలకు అందిస్తున్న పథకాల ఏవిధంగా అమలవుతున్నాయని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులను, వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సెంట్రల్ టీమ్ లీడర్లు ఎం.మధుమతి, జి.నాగ రవికిరణ్, జిల్లా కన్సల్టెన్సీ ఎం.సంతోష్‌కుమార్, సర్పంచ్ సీహెచ్.పూర్ణిమ, ఎంపీడీవో బి.మంగాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో వైభవతి, కార్యదర్శి కె.కృష్ణవేణి కూటమి నాయకులు పాల్గొన్నారు. మార్టేరులో పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, బసంతి దేవి ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు,గుణ్ణం చెరువులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ రిజిస్టర్లు, అంగన్వాడీ, ఆసుపత్రుల్లో నిర్వహణ రిజిస్టర్లు తనిఖీ చేశారు. గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో రాంబాబు, గ్రామ సచివాలయ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి : ఎమ్మెల్సీ బొత్స

కాళ్ళ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావులు వైసీపీ శ్రేణులకు సూచించారు. కాళ్ళ మండలం పెద అమిరంలో ఉండి నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. వైసీపీ ఉండి ఇన్‌ఛార్జి పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు తదితరులు హాజరై మాట్లాడారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన ప్రతి కార్యకర్తను ఉన్నత స్థానంలో నిలుపుతామన్నారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, గూడూరి ఉమాబాల, ముదునూరి మురళీ కృష్ణంరాజు, చినమిల్లి వెంకటరాయుడు, పాతపాటి శ్రీనివాసరాజు, మేడిది జాన్సన్, పెండ్ర వీరన్న, వైసీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఆర్ట్ పోటీల్లో వెంపటాపునకు నగదు పురస్కారం

తణుకు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తణుకుకి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటేషన్‌లో రూ.పది వేల నగదు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ సామల లక్ష్మయ్య ఇన్‌స్టిట్యూ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో వెంపటాపు 'ఇఫ్ ఐ వేర్ టు బి బోర్న్ టుమారో' శీర్షికతో వేసిన చిత్రానికి బహుమతి గెలుచుకున్నారు. ఈనెల 14,15,16 తేదీలలో నెహ్రూ ఆర్ట్ గేలరీ హైదరాబాద్‌లో జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో పురస్కారంతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు



అవార్డు పొందిన పెయింటింగ్



బహుమతి అందుకుంటున్న వెంపటాపు

మిస్సింగ్ మిస్టరీ ?



మహిళలు, బాలికల అదృశ్యాల ఘటనలు పెరిగిపోతున్నాయి. వీటిపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇంట్లోవారి వేదన తట్టుకోలేక, మరికొందరు ప్రేమ పేరుతో, ఇంకొందరు విదేశాల్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ వెళ్లి అదృశ్యమవడం.. ఈవిధంగా రకరకాల కారణాలతో మహిళలు, బాలికలు అదృశ్యమవుతున్నారు. పోలీసులు ఎన్నో రకాలుగా ప్రయత్నించి వారి జాడను గుర్తించి తీసుకొస్తున్నప్పటికీ ఇంకా చాలామంది ఆచూకీ లభ్యంకాకపోవడం మిస్టరీగానే మారింది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

అతివల అదృశ్యం.. కానరాని జాడ

» స్వచ్ఛందంగా వెళ్లిపోతున్న కొందరు
» మాయమాటలతో మరికొందరు..
» ఏడాదిన్నరగా 46 మంది జాడ ఎక్కడ ?

భీమవరం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : మహిళలు అదృశ్యమవడానికి గల నిర్దిష్ట కారణాలు ఎవరికీ తెలియని ప్రశ్నగానే మారింది. ముఖ్యంగా తల్లిదండ్రుల పెంపకం ప్రభావంతో కొంతమంది మహిళలు ఇళ్లల్లోనుంచి వెళ్లిపోతున్నారని, మరికొందరైతే ఉద్యోగాల పేరిట విదేశాలకు వెళ్లి అక్కడ చిక్కుకుని జాడ లేకుండాపోతున్నారు. కొందరిని దుండగులు ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు విక్రయాలు చేయడంతో వారి జాడ కూడా తెలియకుండాపోతుంది. ఈ విధంగా పశ్చిమ గోదావరి జిల్లాలో జనవరి 2024 నుంచి ఇప్పటివరకు 368 మంది మహిళలు అదృశ్యం కాగా, 168 మంది బాలికలు అదృశ్యమయ్యారు. వారిలో 329 మంది మహిళలు ఆచూకీ లభ్యం కాగా, 39 మంది మహిళల ఆచూకీ లభ్యం కాలేదు. అలాగే 161 మంది బాలికల ఆచూకీ లభ్యంకాగా, ఇంకా ఏడుగురి ఆచూకీ లభ్యం కాలేదు.

ప్రేమ పేరుతో వ్యామోహం..

చాలామంది బాలికలు, మైనర్లు, మేజర్లు చదువుకుంటున్నప్పటి నుంచి పాఠశాలల్లో, కళాశాలల్లో ఎవరో ఒకరిపై వ్యామోహం పెంచుకుని, దానినే ప్రేమగా ఊహించుకుంటున్నారు. అవతలి వ్యక్తి చెప్పిన మాటలను నమ్మి చిన్న వయస్సులోనే ఇంట్లో వారికి చెప్పకుండా అవతలి వారితో వెళ్లిపోతున్నారు. తీరా కొంతకాలం అతడి వ్యామోహం తీర్చుకున్నాక వదిలిపెట్టేస్తున్నాడు. ఈ మేరకు వారి జీవితాలు సర్వనాశనమవుతున్నాయి. ఇంటికి వెళ్లాలో.. ఏమి చేయాలో తెలియక సందిగ్ధంలో కొంతమంది మహిళలు, బాలికలు ఆత్మహత్యకు పాల్పడితే మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఏదో ఒక ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొందరైతే యథావిధిగా తల్లిదండ్రుల వద్దకు చేరుతున్నారు. ఎన్నో రకాలుగా ప్రభుత్వం, పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ చాలామందిలో మార్పు రావడం లేదు. ఇటీవల కాలంలో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారని, వారిని కష్టపడకుండా చూసుకోవాలన్న ఆశతో కొంతమంది వలలో పడుతున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు ఉన్నాయని, మంచి జీతం వస్తుందని చెబుతూ ఉండడంతో వారి ఉచ్చులో పడి విదేశాలకు వెళ్తున్నారు. తీరా అక్కడకు వెళ్లాక తీసుకెళ్ళినవారు మోసం చేయడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరినైతే వ్యభిచార ఉచ్చులోకి లాగుతున్నారు. ఇలా చాలామంది మహిళల జీవితాలు అగమ్యగోచరంగా మారుతుంది.

మహిళల పట్ల చిన్నచూపు

చాలాచోట్ల మహిళల పట్ల చిన్నచూపు కనబడుతుంది. పలు కంపెనీల్లో పనిచేసే మహిళల పట్ల అక్కడున్న యాజమాన్యం, తోటి ఉద్యోగులు చిన్నచూపు చూడడంతో వారు ఆందోళనలో ఉంటున్నారు. కొందరైతే మనస్తాపానికి గురైన సందర్భాలు ఉన్నాయి. పెద్దపెద్ద కంపెనీల్లో మహిళలకు ప్రాధాన్యత లేదనేది జగమెరిగిన సత్యం. చాలా ప్రభుత్వాలు 'మహిళలకు పెద్దపీట వేశాం.. వారిని ముందుకు నడిపిస్తున్నాం..' అనే నినాదాలు తప్ప వారిపై ఎటువంటి శ్రద్ధ చూపడం లేదనేది వాస్తవం. దీనివల్ల మహిళలు పురుషుల పట్ల చిన్నచూపునకు గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నకిలీ వెబ్‌సైట్లతో మోసపోవద్దు



చాలామంది మహిళలు, బాలికలు నకిలీ వెబ్‌సైట్లకు బానిసలవుతున్నారు. వాటిని క్లిక్ చేసి ఉద్యోగాల పేరిట వచ్చే వెబ్‌సైట్లతో మోసపోతున్నారు. విదేశాలకు వెళ్లి అక్కడ ఏవిధమైన ఉద్యోగాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రేమ వ్యామోహం, ఉద్యోగాల పేరిట నష్టపోతున్నారు. మహిళలు, బాలికలు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా ఇంట్లో పెద్దవారికి చెప్పి వాటిని సరిదిద్దుకోవాలి తప్ప అనవసరమైన వాటికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోకూడదు. ఎవరైనా ప్రేమ అనే పేరుతో నమ్మించి మోసం చేస్తుంటారు. వారి విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

- ఆర్‌జీ జయసూర్య
భీమవరం డీఎస్పీ

పోలీసులపై చర్యలు తీసుకోవాలి / బుట్టాయగూడెం సీహెచ్‌సీ ఎదుట గిరిజనుల ఆందోళన

బుట్టాయగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): విచారణ పేరుతో గిరిజనుడిని స్టేషన్‌కు తీసుకువచ్చి దౌర్జన్యం చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేశారు. వీరన్నపాలెం గ్రామానికి చెందిన గుజ్జు లక్ష్మడు అనే గిరిజనుడిని విచారణ పేరుతో బుధవారం పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి 'నీ కుమారుడు ఎక్కడున్నాడో చెప్పాలంటూ' కొట్టడంతో లక్ష్మడు ప్రస్తుతం బుట్టాయగూడెం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడని, ఘటనకు కారకుడైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకురాలు మొడియం నాగమణి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ తెలిపారు. కుమారుడి ఆచూకీ తెలియదని చెప్పినా పోలీసులు కొట్టారని చికిత్స పొందుతున్న బాధితుడిని గురువారం ఆసుపత్రిలో పరామర్శించినట్లు తెలిపారు. పోలీసులను తక్షణమే విధుల నుంచి తప్పించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని లేకుంటే గిరిజన సంఘాలతో పెద్దయెత్తున ఆందోళన చేస్తామన్నారు. నాయకులు పోలోజు నాగేశ్వరావు, కారం భాస్కర్, తామా ముత్యాలమ్మ, చుండు బుల్లెమ్మ పాల్గొన్నారు.



బుట్టాయగూడెం సీహెచ్‌సీ ఎదుట గిరిజన సంఘం నాయకుల ధర్నా

వివరాలివి.. వీరన్నపాలెంకు చెందిన గుజ్జు లక్ష్మడు కుమారుడు మహేంద్ర ఇదే గ్రామానికి చెందిన బాలిక కొంతకాలంగా ప్రేమించుకుంటూ ఇటీవల ఇంటినుంచి వెళ్లిపోయారు. బాలిక తరఫువారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ పేరుతో మహేంద్ర తండ్రి లక్ష్మడును స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులు కొట్టారని అందుకే లక్ష్మడు ఆసుపత్రి పాలయ్యాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు పోలీసులపై చర్యలు తీసుకోవాలని బంధువులు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. సీఐ వెంకటేశ్వరరావు గురువారం విచారణ చేస్తానని హామీ ఇవ్వడంతో బుధవారం రాత్రి బంధువులు ఇళ్లకు వెళ్లిపోయారు. గురువారం స్టేషన్‌కు వచ్చిన సీఐ విచారణ చేశారు. తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పదోన్నతి పొందిన ఉద్యోగులతో జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, తదితరులు

ఎనిమిది మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరుసిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్‌లో ఎనిమిది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. బుధవారం జడ్పీ క్యాంపు కార్యాలయంలో పదోన్నతి పొందిన ఎనిమిది మంది జూనియర్ అసిస్టెంట్లకు ఆమెతో పాటు జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు సేవామార్గంలో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా పదోన్నతులు ఇవ్వడం సంతోషకరమైన విషయమని, ఈ అవకాశాన్ని సమర్థవంతంగా పనిచేయడానికి ఉపయోగించుకోవాలన్నారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి మాట్లాడుతూ ఈ పదోన్నతులు ఉద్యోగులపై మరింత బాధ్యత పెంచుతాయన్నారు. ఏవోలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇప్పటివరకు జిల్లా పరిషత్‌లో జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 74 మందికి పదోన్నతులు కల్పించారు. వీరిలో ఏవోలుగా 27మందికి, సీనియర్ అసిస్టెంట్లుగా 31 మందికి, జూనియర్ అసిస్టెంట్లుగా ఆరుగురికి, రికార్డ్/లైబ్రరీ/ల్యాబ్ అసిస్టెంట్లుగా పది మందికి పదోన్నతులు కల్పించారు. జడ్పీ ఏవో ఐవీ రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



యలమంచిలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పెదలంక గ్రామానికి చెందిన గెద్దాడ నాగేశ్వరరావు(57) పాము కాటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ కూలీగా జీవనం సాగించే నాగేశ్వరరావు గురువారం పశువులకు గడ్డి కోస్తుండగా పాముకాటు వేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు నాగేశ్వరరావును రాజోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నాగేశ్వరరావు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


మతిస్థిమితం కోల్పోయి ఉరి వేసుకుని ఆత్మహత్య

పెంటపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసగా మారిన వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన జోగి వెంకట సత్యనారాయణ(45) గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసగా మారి మతిస్థిమితం కోల్పోయాడు. గురువారం ఉదయం లేచి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం వెంటనే ఇంటిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య గంగాభవాని ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రాజేంద్ర కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని సైక్లిస్టు మృతి

కలిదిండి, జూలై 17(ఆంధ్రజ్యోతి): రామిరెడ్డినగర్‌లో లారీ ఢీకొని సైక్లిస్టు మృతి చెందాడు. కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన ఆగరబొట్టి సత్తిబాబు(45) గురువారం ఉదయం ఏలూరుపాడు నుంచి గుర్వాయిపాలెం సైకిల్‌పై వెళ్లి కోళ్ల ఫారంలో కోడి పిల్లలను కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా రామిరెడ్డినగర్ వద్ద వెనుక నుంచి బియ్యపు లోడు లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ ఆత్మహత్య



ఉరివేసుకున్న డ్రైవర్

దెందులూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒక లారీ యజమాని, డ్రైవర్ గొన్నాబత్తుల గణేశ్(38) గురువారం తన లారీకే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏలూరు నగరంలోని కొత్తపేటకు చెందిన గణేశ్ చాలా కాలంగా లారీ నడుపుతున్నాడు. గణేశ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళకు సంబంధించిన వారితో చిన్న వివాదం తలెత్తినట్లు చెబుతున్నారు. ఇది ఘర్షణకు దారితీయడంతో గణేశ్‌ను దుర్భాషలాడి, దాడి చేయగా, మనస్థాపంలో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దెందులూరు మండలం సోమవరప్పాడు పరిధిలో లారీని నిలుపుదల చేసి ఉన్న ప్రదేశంలో అదే లారీ క్యాబిన్ వద్ద తాడుతో ఉరేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. గణేష్‌కు ఇదివరలోనే వివాహం కాగా ఆమెతో విడాకులు తీసుకుని, కొంత కాలంగా వేరే మహిళతో సహజీవనం కొనసాగిస్తున్నాడు. వీరి మధ్య కూడా వివాదాలు తారాస్థాయికి చేరినట్టు సమాచారం. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ శివాజీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు

పోడూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు- పెనుమదం రహదారిలో రైస్‌మిల్లు మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. భర్తకు గాయాలయ్యాయి. పెనుమదం ఎస్‌ఆర్‌ఆర్ పేటకు చెందిన భార్యభర్తలు మల్లిపూడి నందిని (28), మల్లిపూడి రత్నరాజు వీరు మోటార్ సైకిల్‌పై పాలకొల్లు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో భార్య నందిని అక్కడికక్కడే మృతిచెందింది. భర్త రత్నరాజు ఫిర్యాదు మేరకు పోడూరు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పంట చేలో బోల్తాకొట్టిన బస్సు



గాయపడిన విద్యార్థినిని పరామర్శిస్తున్న ఆరిమిల్లి

గమళ్లపాలెంలో స్కూల్ బస్సు బోల్తా

స్వల్పగాయాలు మినహా విద్యార్థులంతా క్షేమం - పరామర్శించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

ఇరగవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో ప్రయాణిస్తున్న స్కూల్ బస్సు అదుపుతప్పి పంట చేలో బోల్తా కొట్టిన ఘటన గురువారం రేలంగి గ్రామ శివారు గమళ్లపాలెంలో చోటు చేసుకుంది. తణుకు పట్టణానికి చెందిన ప్రైవేటు స్కూల్ బస్సు గురువారం ఉదయం విద్యార్థులతో పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు, వెలగలవారిపాలెం, పెనుమంట్ర, జుత్తిగ, రామేశ్వరం గ్రామం నుంచి పాలి గ్రామం మీదుగా తణుకు బయల్దేరింది. గమళ్లపాలెంలోకి వచ్చేసరికే ఎదుటి వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న పంట చేలోకి బోల్తా కొట్టింది. విద్యార్థులు కేకలు వేయడంతో స్థానికులు, రైతులు అప్రమత్తమై బస్సు నుంచి విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఒకవేళ బస్సు పంట చేను వైపు కాకుండా పక్కనే ఉన్న కాలువలోకి బోల్తా కొట్టి ఉంటే పెనుప్రమాదమే జరిగి ఉండేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో బస్సులో 23 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉన్నట్టు సమాచారం. ప్రమాదంలో స్వల్ప గాయాలైన నలుగురిని తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి తిరిగి ఇంటికి పంపారు. కేసు నమోదు చేసి బస్సును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఇరగవరం ఎస్‌ఐ జానా సతీశ్ తెలిపారు. విషయం తెలుసుకున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. మరోసారి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన కోరారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతిబ్ కౌసర్ బానో హుటాహుటిన తణుకు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని,ఆందోళనచెందాల్సిన పనిలేదని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

వాహనాలను తనిఖీ చేసిన ట్రాఫిక్ పోలీసులు

ఏలూరుక్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు, కాలేజీల విద్యార్థులను తీసుకువెళ్ళే బస్సులు, ఆటోల డ్రైవర్లకు గురువారం ఆకస్మికంగా బ్రీత్‌ఎనలైజర్లతో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించారు. కొంత మంది డ్రైవర్లు మద్యంతాగి వాహనాలు నడుపుతున్నారని సమాచారం అందడంతో చిన్నారుల ప్రాణ భద్రతకు పెనుముప్పుగా మారే పరిస్థితులను నివారించేందుకు ఈ తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కౌన్సిలింగ్ కూడా చేశారు. ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపే కఠిన చర్యలు తీసుకుంటామని,పరిమితికి మించి అదనంగా ప్రయాణీకులను ఎక్కించుకోకూడదని, అతి వేగంగా వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యనమదుర్రులో మృతదేహం లభ్యం

భీమవరం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా యనమదుర్రు డ్రెయిన్‌లో దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. 39వ వార్డు దుర్గాపురానికి చెందిన వేలేటి భవానీ దుర్గాప్రసాద్(31) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. బావమరిది పాలేపి దుర్గారావు తన బావ కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు బైపాస్ రోడ్డులో ఉన్న వంతెనపైన పాదరక్షలు కనబడటంతో యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి గాలించినా దుర్గా ప్రసాద్ కనిపించలేదు. గురువారం వంతెన సమీపంలో దుర్గాప్రసాద్ మృతదేహం కనిపించగా బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టూటౌన్ ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వృద్ధుడు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు ఆర్‌ఆర్‌పేటకు చెందిన మెండాల చిన్న(60) తన కుటుంబంతో కలిసి రాత్రి వేళ చిత్తుకాగితాలు ఏరుకుని జీవిస్తున్నాడు. ఈ 10వ తేదీ అర్ధరాత్రి ఏలూరు క్రరలవంతెన సమీపంలో ఏలూరుకు చెందిన బాలుడు (16) ఒక మోటారు సైకిల్ అపహరించి అతి వేగంగా వెళ్తూ చిన్నాను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన చిన్నా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ జి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మధువెంకటరాజా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు మీదుగా నడిచే రెండు ప్రత్యేక రైళ్ళను ఈ ఏడాది ఆగస్టు 18 వరకూ పొడిగిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. రైల్ నెంబర్ 06085 యర్నాకుళం నుంచి పాట్నాకు ప్రతి శుక్రవారం బయల్దేరుతుంది. ఈ రైలు ఈనెల 25 నుంచి ఆగస్టు 15 వరకూ నడపనున్నారు. రైల్ నెంబర్ 06086 పాట్నా నుంచి యర్నాకుళం ప్రతి సోమవారం బయల్దేరుతుంది. ఈ నెల 28 నుంచి ఆగస్టు 18 వరకూ ఈ రైలు నడపనున్నారు. ఈ రైళ్ళు అలువ, త్రిచూర్, పాలక్కాడ్, కోయంబత్తూర్, తిరుపూర్, శాలం, జాలర్ పెట్టాయ్, కాట్పాడి, అరక్ వానామ్, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, బాపట్ల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, సోంపేట, బరంపూర్, బల్గాన్, కుర్థారోడ్, బార్థామాన్, దుర్గాపూర్, అసాంగ్‌సోల్, చిత్తరంజన్, జంతార, మధుపూర్, జసిడ్, జాజా, కీల్, మొక్కోమా, భక్తియార్‌పూర్, పాట్నాసాహెబ్, రాజేంద్రనగర్ టెర్మినల్ రైల్వే స్టేషన్లలో ఆగనున్నాయన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

భీమవరం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న నలుగురిని గురువారం అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఎస్.నాగరాజు తెలిపారు. గునుపూడి శివారు రైల్వే అండర్ టన్నెల్ బ్రిడ్జి వద్ద చెరువు గట్టుపై గంజాయి విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో సీఐ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్ళారు. అక్కడ గునుపూడికి చెందిన నాయక్ కరుణాకర్, రెల్లి కాలనీకి చెందిన నీలాపు దుర్గాప్రసాద్, నర్సయ్య అగ్రహారానికి చెందిన గాదిన ప్రభుకుమార్, జెండా నాగరాజులను అరెస్ట్ చేసి వారి నుంచి 2.8 కేజీలు(రూ.60 వేలు) గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఆ నలుగురిని కోర్టుకు పంపగా రిమాండ్ విధించారన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక యువకుడు మృతి చెందాడు. ఉండికి చెందిన వాకలపాటి శ్రీను(33) అతనికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 16న ఏ కారణమో తెలియదు కాని పురుగు మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురవడంతో అతడిని భీమవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి వైద్యులకు సమాచారమిచ్చారు. దీంతో ఉండి పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద పోస్టుమార్టం నిర్వహించి గురువారం రాత్రి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

నన్నయ్య క్యాంపస్ డ్రైవ్‌లో 50 మందికి ఉద్యోగాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 50 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గురువారం కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 150 మంది ఫార్మసి విద్యార్థులు పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రొఫెసర్ టి అశోక్ అభినందించారు. కార్యక్రమంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ నిత్యానంద్ పాల్గొన్నారు.

తల్లికి వందనంపై బ్యాంకులకు కలెక్టర్ సూచన

భీమవరం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి):తల్లికి వందనం పథకంపై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల అధికారులతో గురువారం గూగుల్ మీట్ ద్వారా కలెక్టర్ నాగరాణి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం తల్లుల బ్యాంకు ఖాతాలకు జమచేసిన రూ.13వేల సొమ్ము పాఠశాలల, కళాశాలల విద్యార్థుల ఫీజు చెల్లింపులకు మాత్రమే వినియోగించుకోవలసి ఉందన్నారు. తల్లులకు ఎవరికైనా బ్యాంకులలో వ్యక్తిగత రుణాలు ఉన్నట్లయితే తల్లికి వందనం సొమ్ము నుంచి మినహాయించుకోకూడదని కలెక్టర్ సూచించారు.

జగనన్న కాలనీల పేరుతో వైసీపీ మోసం

ఇరగవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో సెంటు స్థలంలో కట్టించి ఇచ్చిన కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం అయినపర్రు, ఓగిడి గ్రామాల్లో ఎమ్మెల్యే రాధాకృష్ణ పర్యటించి గత ఏడాదికాలంగా అందుతున్న సంక్షేమం అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ పరిధిలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.


వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

బస్సులకు ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు

తణుకు, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ లేకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హెచ్చరించారు. గురువారం ఇరగవరం మండలం సమీపంలోని తణుకుకు చెందిన ప్రైవేటు స్కూలు బస్సు ప్రమాదంలో గాయపడి తణుకు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్ చేయించే బాధ్యతను సంబంధిత యాజమాన్యాలు తీసుకోవడం పాటు నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. బస్సులో 25మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నప్పటికి అదృష్టం కొద్ది ఎవ్వరికి గాయాలు కాలేదన్నారు. చాలా మంది డ్రైవర్లు ఫోన్ మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తున్నారని తెలిపారు. శాఖా పరంగా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని వివరించారు.

ముత్యాలమ్మకు ఆషాఢ సారె



పెంటపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం సందర్భంగా ఆకుతీగపాడు గ్రామ దేవత ముత్యాలమ్మకు గురువారం గ్రామస్థులు ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. కార్యక్రమంలో అర్చకుడు కొడవటిగంటి నర్సింహాచార్యులు, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బుద్దన ధనరాజు, ఆలయ కమిటి ఛైర్మన్ కొల్లూరి గురురామారావు పాల్గొన్నారు.

నందమూరులో గోగులమ్మ..



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నందమూరు గ్రామదేవత గోగులమ్మతల్లికి గురువారం గ్రామస్థులు ఆషాఢ సారె సమర్పించారు. గ్రామంలో సారెతో మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు కుంకుమ, పిండి వంటలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శనగన వరలక్ష్మి, రాంబాబు, మాజీ సర్పంచ్ యామన సత్యనారాయణ, షుట్టింటివారు బోయిడి రాము, అత్తింటివారు దేవులపల్లి సుబ్బారావు, నాయకులు దార్లంక శ్రీనివాస్, మామిడి శంకరం, కుంట్ల వీరవెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

పల్లాలమ్మ..

ఆచంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి):పెదమల్లం గ్రామదేవతలు పల్లాలమ్మ, మారెమ్మ, కోట్లమ్మ అమ్మవార్లకు గ్రామానికి చెందిన భక్తులు వివిధ రకాల స్వీట్లు , గాజులు, చీరలు వంటి వాటితో గ్రామ పురవీధులగుండా తిరిగి అనంతరం అమ్మవార్లకు ఆషాఢసారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, బోడపాటి బాబులు, యూత్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


పెదమల్లంలో అమ్మవారికి సారె తెస్తున్న మహిళలు


గాదిరాజు సుబ్బరాజును పరామర్శిస్తున్న డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు

సుబ్బరాజుకు ఆర్ఆర్ఆర్ పరామర్శ

భీమవరం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పారిశ్రామిక వేత్త, అల్లూరి సీతారామరాజుసేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు తండ్రి వెంకట్రామరాజు మరణించటంతో గురువారంనాడు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు పరామర్శించారు. వెంకట్రామరాజు చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

కాళ్ళకూరులో జడ్పీ ఛైర్మన్ పర్యటన


కాళ్ళకూరు యూపీ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ పద్మశ్రీ

కాళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాళ్ళకూరులో జడ్పీ ఛైర్మన్ సుంకర పద్మశ్రీ గురువారం పర్యటించారు. తొలుత గ్రామంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని యూపీ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. తమ పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడు లేరని, పోస్టు భర్తీ చేయాలని గ్రామ ఉప సర్పంచ్ నడింపల్లి ప్రదీప్‌రాజు ఆమెను కోరారు. అదేవిధంగా పాఠశాలకు మరొక అదనపు భవనం అవసరం ఉందని కోరారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ప్రస్తుతానికి తాత్కాలికంగా వారంలో రెండు, మూడు రోజులపాటు హిందీ ఉపాధ్యాయుడు వచ్చే విధంగా చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు. జడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, సర్పంచ్‌లు సాధు శ్రీదేవి, కొలుకులూరి ధర్మరాజు, ఎంఈవో ఎ.రవీంద్ర పాల్గొన్నారు.

పెదఅమిరంలో వంతెన నిర్మాణ పనులు

కాళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పెద అమిరంలో వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని సర్పంచ్ సోమేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని సత్రం ఎదురుగా పంచాయతీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మిస్తున్న వంతెన పనులను గురువారం పరిశీలించి మాట్లాడారు. గతంలో ఈ ప్రాంతలో తూములతో వంతెన ఉండేదని, దాని స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కాంక్రీట్ బ్రిడ్జ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వంతెన నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో నిర్మించి త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

24న దివ్యాంగుల ఉపకరణాల శిబిరం

కాళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కాళ్ల, ఉండి, ఆకివీడు, పాలకోడేరు మండలాల పరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాలైన కృత్రిమ కాళ్ళు, చేతులు, వినికిడి సాధనాలు అందించేందుకు ఈ నెల 24న ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు కాళ్ల ఎంపీడీవో జి.స్వాతి తెలిపారు. ఉండి హైస్కూల్‌లో అర్హత, నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు తమ ఆధార్, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, రెండు ఫొటోలు తీసుకుని ఉదయం 10 గంటలకు శిబిరానికి హాజరుకావాలని కోరారు.

ఉత్తమ వైద్యాధికారిగా రంగం నాయుడు


కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న డాక్టర్ రంగంనాయుడు

కాళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ వైద్యాధికారిగా కాళ్ల మండల వైద్యాధికారి డాక్టర్ చినమిల్లి రంగంనాయుడు అవార్డు అందుకున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రతినిధులు తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కార్యాలయంలో జరిగిన సభలో జిల్లా ఉత్తమ వైద్యాధికారిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గీతాబాయి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, రూ. 7 వేలు చెక్కును అందుకున్నారు. జిల్లాలో ఎక్కువ వేసెక్టమీ ఆపరేషన్లు చేసినందుకుగాను ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు.

త్వరలో పాసింజర్ రైళ్లకు సీసీ కెమెరాలు


జక్కంపూడి కుమార్, డీఆర్‌యూ సీసీ మెంబర్

పాలకొల్లు అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని అన్ని పాసింజర్ రైళ్లలో త్వరలో కేంద్ర ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నట్లు డీఆర్‌యూసీసీ మెంబర్ జక్కంపూడి కుమార్ తెలిపారు. గురువారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి సూచనలతో ఈవిషయాన్ని తెలియజేస్తున్నట్టు కుమార్ తెలిపారు. ఇంజన్‌కు రెండువైపులా కూడా కెమెరాలు ఉంటాయని, దీనివల్ల దొంగతనాలు అరికట్టడం, ఆత్మహత్యలు చేసుకునేందుకు ప్రయత్నిస్తే సిబ్బంది అప్రమత్తం కావడం జరుగుతుందని తెలి పారు. అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

తణుకు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం చిట్టూరి హెరిటేజిలో డీఏఈఎస్‌ఐ కోర్సు (డిప్లమో) చేసిన 38మంది ఎరువులు, పురుగు మందుల డీలర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం అమ్మకాలు కాకుండా రైతులు పక్షాన పనిచేయాలని అన్నారు. రైతులు ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు జి.నరేంద్ర. ఎం.వి. రమేష్, ఏవోలు కె.రాజేంద్రప్రసాదు, కేడీఎన్ రాజేష్, వై.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



విద్యుత్ లైన్లపై పడిన చెట్టు కొమ్మ

ఆకివీడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాణా వీధిలోని ఎంపీపీ పాఠశాల (జూపిడి సుబ్బన జమిందార్ స్కూల్) దగ్గర ఉన్న భారీ వృక్షం కొమ్మ విద్యుత్ తీగలపై నుంచి రోడ్ మీద పడింది. ఆ సమయానికి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తుండడంతో సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే పాఠశాలలో విద్యార్థులు ఉన్నారు. అదే సమయానికి రోడ్‌మీద ఎవరూ లేరు. పాఠశాలకు ఎదురుగా ఉన్న ఇంటి గోడపై పడడంతో కొంచెం దెబ్బతిన్నది. అనంతరం విద్యుత్ సిబ్బంది వచ్చి కొమ్మను తొలగించి సరఫరా పునరుద్ధరించారు.

ముగిసిన మహారుద్రయాగం

ఆచంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) :నెలమూరుకు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర శర్మ ట్రస్టు వేద పాఠశాల ఆధ్వర్యంలో వారం రోజులుగా ఆచంటేశ్వరుని సత్రం వద్ద మహారుద్రయాగ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఆఖరి రోజు అయిన గురువారం మహాపూర్ణాహుతి తోపాటు ప్రత్యేక హోమాలు అనంతరం అన్నప్రసాదరణ వితరణ నిర్వహించారు.

అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి):మానవ అక్రమ రవాణాపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్. ఇందిర అన్నారు. మానవ అక్రమ రవాణా నియంత్రణపై పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఉపాధి అవకాశాల పేరుతో మహిళలు ఎక్కువగా మోసపోతున్నారనీ దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.

రవాణా రంగానికి ఊరట

5వ పేజీ తరువాయి

పడుతోంది. మైనింగ్ సీనరేజ్ వసూళ్లపై సంబంధిత శాఖ అధ్యయనం చేయాల్సి ఉంది.

పన్ను తగ్గింపుతో ఉపశమనం



రాష్ట్ర ప్రభుత్వం హరిత పన్ను తగ్గించడం వాహన యజమానులకు కొంత ఉపశమనం కలిగించింది. భవన నిర్మాణాల ఫిల్లింగ్‌కు వినియోగించే డస్ట్ (బూడిద, కాంక్రీట్) పనులకు వినియోగించే ముప్పాతిక సైజు కంకర తదితర వాటిపై వసూలు చేస్తున్న మైనింగ్ సీనరేజ్‌ను తగ్గించాలి. అధికంగా వసూళ్లపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

- రాపూరి రాజా, అధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టిప్పర్ లారీ యజమానుల అసోసియేషన్

ప్లాస్టిక్ నిషేధించలేరా..?

5వ పేజీ తరువాయి

ఎంహెచ్‌వో, ఆర్డీవోలు దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. తణుకు బస్టాండ్‌లో శంకుస్థాపన చేసిన పింక్ టాయిలెట్ నిర్మాణంలో సాకులు చూపుతున్న ఆర్టీసీ ఆర్ఎంపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఉచితంగా నిర్మించి ఇస్తామంటే సాకులు చెప్పడం తగదన్నారు. భీమవరం బస్టాండ్ సమీపంలో గుర్తించిన స్థలంలో పింక్ టాయిలెట్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసిన బ్యానర్లను వెంటనే తొలగించాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. మావుళ్లమ్మ దేవస్థానం వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరించేలా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

భవ్య భీమవరం పేరిట చేపట్టిన అభివృద్ధి పనులను వచ్చేనెల 15న నాటికి పూర్తిచేయడానికి కృషి చేయాలని దాతలు, అధికారులకు కలెక్టర్ నాగరాణి సూచించారు. ఇప్పటికే పనులు ప్రారంభించి ఆరు నెలలు దాటిందన్నారు. భీమవరం పాత బస్టాండ్ పనులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డుకాలనీలో ఆదిత్య పార్క్ పనులను వచ్చేనెల 15న ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారి టి.త్రినాథరావు, డీఈలు, ఏఈలు, టీపీవో, టౌన్ సర్వేయర్, ఆర్ అండ్ బి అధికారి, వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన దాతలు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

తణుకు, జూలై 17(ఆంధ్రజ్యోతి): తణుకు మానవత సంస్థ ద్వారా పలువురికి సాయం అందజేశారు. శుక్రవారం గమిని ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు రాజరాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యాక్రమంలో రేలంగి శివారు గవర్లపాలెం గ్రామానికి చెందిన వేగి మానసకు ఇంజనీరింగ్ కాలేజి ఫీజు నిమిత్తం రూ.5వేలు, పెయింటింగ్ పనులు చేసుకునే వంకల రామచంద్రరావుకు ప్రమాదంలో చెయ్యి విరిగిపోవడంతో వైద్యం, మందులు ఖర్చుల నిమిత్తం రూ.5వేలు అందజేశారు. శ్రీకరి ఎమర్జెన్సీ ఆసుపత్రి డాక్టర్ బోగవల్లి వెంకట్రావు, డాక్టర్ స్వాతి ఈ సహాయం అందించినట్టు జిల్లా మానవత శాంతి ర్యాలీ అధ్యక్షుడు గమిని రాంబాబు తెలిపారు. చిట్టూరి సుజాత, కఠారి శారదాదేవి, రామకాశీ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ఆకివీడు రూరల్ జూలై 17(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి ఛారిటబుల్ ట్రస్టు వారిచే దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. కుప్పనపూడిలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం సోదరి డాక్టర్ గొల్లపల్లి కాశీ విశాలక్షి తన ట్రస్టు ద్వారా ఐదుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. కుప్పనపూడి గ్రామంలో మంచినీటికి రూ.2లక్షలు అందజేశారని తెలిపారు. సర్పంచ్ ముత్యాల అనూరాధ, జనసేన నాయకులు యేరుబండి రాము, అల్లాడి బాలాజీ, బండి కొండ, నంద్యాల శివ, ముత్యాల బుజ్జి పాల్గొన్నారు.

దోమ చిన్నదైనా.. ప్రమాదం పెద్దది!

గణపవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దోమలు చిన్నవే, వాటివలన వచ్చే వ్యాధులు పెద్దవని పీఎంపీల అసోసియేషన్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం కాశిపాడులో డెంగీ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సీజన్‌లో డెంగీ జ్వరాలు అధికంగా వస్తాయని, ప్రజలు డెంగీ నివారణ చర్యల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. పీఎంపీల సభ్యులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గణపవరం మండల పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, ఈసీ సభ్యుడు ఎం.శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

కేజీఆర్ఎల్ విద్యార్థుల రక్తదానం

భీమవరం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో కేజీఆర్ఎల్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. జిల్లా రెడ్ క్రాస్ వైస్ అధ్యక్షుడు వబిలిశెట్టి కనకరాజు, కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ ఆరేటి ప్రకాష్ పాల్గొన్నారు

ఆవులకు లంపీస్కిన్ టీకాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కొమ్ముగూడెం, పట్టింపాలెం గ్రామాల్లో గురువారం లంపీస్కిన్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 31 వరకు ఈ టీకాల క్యాంపులు నిర్వహిస్తున్నామని మండల పశువైద్యాధికారి డాక్టర్ టి విజయ్‌కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీలకు కనీసం వేతనం ఇవ్వాలి

తాడేపల్లిగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. తాడేపల్లిగూడెం యూనిట్ మొదటి మహాసభ సీఐటీయూ కార్యాలయంలో జె.శ్యామల అధ్యక్షతన గురువారం జరిగింది. ఈమహాసభను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ర్యూస్సి, ప్రాజెక్టు కార్యదర్శి అశ్వని మాట్లాడుతూ గ్రాడ్యుటీ అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, బీమా సౌకర్యంకల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవాధ్యక్షురాలుగా జి.దేనా స్వరూపరాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు జె.శ్యామలకుమారి, కార్యదర్శి ఎండీ హసీనా బేగం, కోశాధికారి ఆర్.అనురాధ, వి.కనకమహాలక్ష్మి, 26 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం


ములపర్రు త్రిసభ్య కమిటీ సభ్యులను అభినందిస్తున్న కూటమి నాయకులు

గణపవరం, జూలై17 (ఆంధ్రజ్యోతి): గణపవరం, మొయ్యేరు, జల్లికాకినాడ వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీల పాలకవర్గం పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. మొయ్యేరు సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా కానుమల్లి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లుగా గుత్తుల వెంకటేశ్వరరావు, గంటా రామకృష్ణ, గణపవరం సొసైటీ ఛైర్మన్‌గా కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, డైరెక్టర్లుగా గొరెల వెంకటశ్రీనివాస్, కన్నాజీ శ్రీనివాసరావు, జల్లికాకినాడ సొసైటీ ఛైర్మన్‌గా ఇందుకూరి చక్రవర్తిరాజు, డైరెక్టర్లుగా దండు సూర్యనారాయణరాజు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: ములపర్రు ది హిందూ ముస్లిం ప్రాథమిక వ్యవసాయసహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా గుత్తుల లోకేశ్వరరావు, సభ్యులుగా ఉటాల వెంకటేశ్వరరావు, నెక్కంటి భాస్కరరావు ప్రమాణ స్వీకారం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పాలకొల్లు అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్థానిక క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించగా 86 రోజులకు రూ.13.31.554 ఆదాయం వచ్చినట్టు ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు (భీమవరం) పర్యవేక్షణలో లెక్కింపు జరిపారు.

మావుళ్ళమ్మ జాతర

భీమవరం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 37వ వార్డు యాదవుల వీధిలో మావుళ్ళమ్మ జాతర గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు జాతరను ప్రారంభించారు. అనంతరం కేరళ డప్పులు, వాయిద్యాలు, శక్తి వేషాల నృత్యాలతో అమ్మవారి జాతర నిర్వహించారు.

పల్లెల ప్రగతికి బాటలు వేద్దాం

ఉండి, జూలై 17(ఆంధ్రజ్యోతి):పల్లెల ప్రగతికి ప్రణాళికతో అభివృద్ధి పనులు చేద్దామని డిప్యూటి స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం వాంద్రం గ్రామంలో కెనరా బ్యాంక్ ఆర్థిక సహకారంతో నిర్మించిన మంచినీటి పథకం, గ్రామంలో నిర్మించిన రహదారి, కల్వర్టు వివిధ పనులను డిప్యూటి స్పీకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. సర్పంచ్, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు దాసరి వెంకటకృష్ణ అధ్యక్షతన కార్యక్రమాలు జరిగాయి. డిప్యూటి స్పీకర్ మాట్లాడుతూ నిధులు కొరత ఉన్నప్పటికీ శక్తిమేర పలు గ్రాంటులను తీసుకుని వచ్చి ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టి పల్లెల ప్రగతికి బాటలు వేస్తున్నామన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుపై హర్షం

తాడేపల్లిగూడెం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కు స్థల కేటాయింపుపై పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొరపట్ల రాము, గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, సంఘ డైరెక్టర్ పద్మనాభుని మురళి హర్షం వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతిలో పొట్టిశ్రీరాములు ట్రస్ట్‌కు కేటాయించిన 6.50 ఎకరాల భూమిలో 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తుండడం పట్ల ఆనందంగా ఉందన్నారు.

ప్రజలతో స్నేహంగా ఉండాలి

తాడేపల్లిగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ, మున్సిపల్, సచివాలయం అధికారులతో కమిషనర్ ఏసుబాబు సమీక్ష నిర్వహించారు. ప్రజల వద్ద మున్సిపల్ అధికారులు వెళ్లే సమయంలో అక్కడ వారితో మంచి స్నేహపూరిత వాతావరణంలో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తే వారి వద్ద నుంచి మంచి పాజిటివ్ రిపోర్టు వస్తుందన్నారు. మున్సిపల్ శాఖా మంత్రి పీ నారాయణ వచ్చిన సందర్భంలో మున్సిపాలిటీకి రూ.2.85 కోట్లు మంజూరు చేశారన్నారు.

వ్యవసాయ శాఖలో ఏడీల బదిలీ

ఏలూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో పలువురు ఏడీల బదిలీల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మేరకు ఉన్నతాధికారులు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పలువురికి మార్పులు చోటు చేసుకున్నాయి. జె.శశిబిందు నిడదవోలు నుంచి రామచంద్రాపురం, ఏడీఏ మురళీకృష్ణ కైకలూరు నుంచి పాలకొల్లు, ఏడీఏ ప్రసాద్ తాడేపల్లిగూడెం నుంచి నర్సాపురం, ఎ.పార్వతి పాలకొల్లు నుంచి కైకలూరు, ఈఎస్ భాస్కర్‌రావు నర్సాపురం నుంచి తాడేపల్లిగూడెం బదిలీ అయ్యారు.



ఆస్పత్రికి కుర్చీలు అందజేత

పాలకొల్లు టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మానవతా సేవా సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ వార్డులో రోగుల వినియోగార్థం 15 కుర్చీలను విశ్రాంత ఎస్‌బీఐ ఆఫీసర్ కె సుధీర్ అందజేశారు. సెక్షన్ వైద్యురాలు రేణుక, డాక్టర్ వసంత భూషన్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ వీరా, మానవతా సభ్యులు ముత్యాల శ్రీనివాస్, జిల్లా డైరెక్టర్ ముత్యాల రామారావు, సీనియర్ సభ్యులు గుడాల హరిబాబు, పిఎస్ ప్రతాప్ రాజు, బి రమాకాంత్, ఎం శ్రీవాస్తవ ప్రదీప్, వి వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల షాపుల తనిఖీ

పెనుగొండ, జూలై17(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ బృంద అధికారులు పెనుగొండ మండలంలో పలు ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించారు. ఎరువుల బస్తాలు నిర్దేశిత బరువు ఉన్నాయా లేదా అనేది కూడా పరిశీలించారు. సరైన పత్రాలు లేని 8.28 లక్షల విలువ గల ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి గోపాలకృష్ణ, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. బుల్లి బాబు, మండల వ్యవసాయాధికారి పి. స్పందన పాల్గొన్నారు.



సాయిబాబాకు శాకంబరి అలకరణ

పెనుగొండ, జూలై17(ఆంధ్రజ్యోతి): వడలి గ్రామంలో సాయిబాబాను ఆషాఢం సందర్భంగా శాకంబరిగా అలంకరణ చేశారు. సాయంత్రం సమయంలో బాబా వారి తరుఫున గ్రామ దేవత మండాలమ్మ అమ్మవారికి చలిమోర్ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, స్వీట్లు, చలిమిడి పానకాలు తీసుకువచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు/పోడూరు/నరసాపురం టౌన్ /తాడేపల్లిగూడెం రూరల్/మొగల్తూరు/ఉండి/, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజనల్ ఇంజనీర్ నరసింహామూర్తి తెలిపారు.

- తణుకు పట్టణం, మండలంలోని గ్రామాలు, అత్తిలి, ఇరగవరం మండలంలోని గ్రామాల్లో సరఫరా ఉండదని అధికారులు చెప్పారు.
- పోడూరు మండలం పెనుమదం, గుమ్మలూరు, పైడావ, బండారువారి చెర్వు, అప్పన్నచెర్వు, రాజలగర్వు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ కె.మధు కుమార్ తెలిపారు. ఉదయం 7గంటలు నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.
- నరసాపురం పట్టణంలో స్టీమర్‌రోడ్, పొన్నపల్లి, పంటి రేవు, వైఎన్‌కాలేజీ, కొండాలమ్మ గుడి, పాత బజార్, పంజా సెంటర్, చర్చి రోడ్‌లో సరఫరా ఉండదు.
- తాడేపల్లిగూడెం మండలంలో తాడేపల్లిగూడెం మెయిన్‌రోడ్డు, తాళ్లముదునూరుపాడు, సీతారాంపేట, భాగ్యలక్షీపేట జగన్నాధపురం, కుంచనపల్లి, మెట్టఉప్పరగూడెం, ఇటుకులగుంట గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదు.
- మొగల్తూరు మండలం మొగల్తూరు, కొండావారిపాలెం, పాతకాలువ సెంటర్, రామన్నపాలెం, లక్కువారితోట, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాలతో పాటు కాళీపట్నం సబ్ స్టేషన్ పరిధి కాళీపట్నం తూర్పు, పడమర, జగన్నాధపురం, దారితిప్ప, కొత్తోట, ముత్యాలపల్లి, వారతిప్ప, కోమటితిప్ప గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.
- ఉండి మండలం కోలమూరు, పాములపర్రు, ఉప్పులూరు, పాందువ్వ, కలిగొట్ల, ఆరేడు గ్రామాలతో పాటు ఇండస్ట్రీయల్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. అలాగే యండగండి, ఉణుదుర్రులో విద్యుత్ సరఫరా ఉండదు.

క్యాన్సర్ బాధిత బాలుడికి సాయం

పాలకొల్లు టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్థానిక దర్జీ పని చేసుకుని జీవించే సోమేశ్వరరావు మనవడు లోక్ నందన్‌కు (3ఏళ్ళు)కు బ్లడ్ క్యాన్సర్ వ్యాధికి గురి కావడంతో ఆర్థికంగా ఆకుటుంబానికి ఆసరాగా నిలబడడానికి వాకర్స్ క్లబ్ ముందుకు వచ్చింది. వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ తటవర్తి సుధాకరరావు సభ్యులు కలిసి రూ.30వేలు సేకరించి గురువారం బాలుడు తాత సోమేశ్వరరావుకు అందజేశారు.

వసుధా ఫౌండేషన్ సాయం

పాలకొల్లు టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): వసుధా ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు నివాసంలో గురువారం ఇరువురు వ్యాధి గ్రస్తులకు ఒకొక్కరికి రూ.10వేలు చొప్పన ఆర్థిక సహాయం అందించారు.

నేడు ఎమ్మెల్యే పితాని రాక

ఆచంట, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి శుక్రవారం చేరుకుంటారని ఎమ్మెల్యే పితాని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. మధ్యాహ్నం 2.50 గంటలకు రాజమండ్రి విమానాశ్రమానికి చేరుకుని కొమ్ముచిక్కాలకు వెళతారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

నరసాపురం టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు అందించాలన్న ఉద్దేశంతో నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగ పర్చుకోవాలని విప్ నాయకర్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ఈనెల 23న వైఎన్‌లో ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలతో సంయుక్తంగా మేళా నిర్వహిస్తుందన్నారు.